క్లుప్తంగా

'శీరం'ను పరామర్శించిన వైవీ సుబ్బారెడ్డి



చికిత్స పొందుతున్న శీరం నర్సింహంమూర్తిని పరామర్శిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

ఆరిలోవ: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి ఆరిలోవ హెల్త్ సిటీ ఎంబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నర్సింహామూర్తిని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లి నర్సింహామూర్తి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని సుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, పాయకరావుపేట మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వాల్మీకులకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: వచ్చే శాసనసభ ఎన్నికల్లో వాల్మీకి కులానికి ప్రాధాన్యమివ్వాలని ఆదివాసి వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాసినట్లు సంఘం నాయకులు శుక్రవారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామమూర్తి మాట్లాడుతూ దశాబ్దాలుగా పాడేరు ఏజెన్సీలో బలమైన గిరిజన సామాజికవర్గంగా ఉన్న వాల్మీకి, భగత, కొండదొర సామాజిక వర్గాలకు శాసనసభ ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఏర్పాటైన తరువాత కూడా ఇది కొనసాగిందన్నారు. ఈ సామాజిక వర్గాలకు చెందిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్ : సాంస్కృతిక సినీ సంగీత సంస్థ గీత్ సంగీత్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 6న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం వార్షికోత్సవ పోస్టర్‌ను కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ యమునా తీరం సంధ్యారాగం పేరిట నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో తెలుగు, హిందీ చలన చిత్రాల్లోని పలు గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపించనున్నారని చెప్పారు. సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కళాప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓబీసీ ఉద్యోగుల సమీక్ష సమావేశం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వేలో ఓబీసీ ఉద్యోగుల సంక్షేమం, వాటి అమలు, ఇతర సమస్యలపై శుక్రవారం భువనేశ్వర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు అలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ తెలిపారు. ఓబీసీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాజేష్‌వర్మ, 30 మంది ఎంపీలు, కమిటీ సభ్యులు న్యూఢిల్లీ నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వే హెడ్ క్వార్టర్స్ భువనేశ్వర్‌లో జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించారని చెప్పారు. ఓబీసీ కార్మికులు, నాయకులపై కక్ష సాధింపు చర్యలను అధికారులు, యాజమాన్యం విడనాడేలా తగిన సూచనలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఓబీసీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారికి వినతిపత్రం అందించామని రాజశేఖర్ తెలిపారు. నిర్వాహక అధ్యక్షులు రామచంద్రరావు, బి.కె.సాహూ, శివప్రసాద్, జి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పండగలా పెంచిన పింఛన్ల పంపిణీ

ఆరిలోవ: పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ శుక్రవారం తూర్పు నియోజకవర్గంలో పండగలా జరిగింది. వృద్ధులు, వితంతువులకు ఈ నెల నుంచి పెంచిన పింఛన్ రూ.3వేలను ఆరిలోవలో లబ్ధిదారులకు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. తెల్లవారేసరికి ఇంటింటికి వలంటీర్లు వచ్చి డబ్బులు అందించడంతో లబ్ధిదారుల ముఖాలు చిరునవ్వుతో వెలిగిపోతున్నాయి. జీవీఎంసీ 9 నుంచి 13 వార్డుల్లో వలంటీర్లు గురువారం నుంచి పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. ఆయా వార్డుల్లో సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు వలంటీర్లతో కలిసి ఈ పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంత వరకు ఉన్న రూ.2,750 పింఛన్‌ను పెంచి ఈ నెల నుంచి రూ.3 వేలు అందిస్తున్నారు. ఇక నుంచి ప్రతి నెలా రూ.3 వేలు అందుతుందని లబ్ధిదారులకు నాయకులు తెలియజేశారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత

ఆరిలోవ కాలనీకి చెందిన 64 ఏళ్ల వృద్ధుడు శీలం నర్సింగరావు కొన్నాళ్లుగా చర్మవ్యాధితో బాధపడుతున్నారు. పది రోజుల క్రితం ఆయన కేజీహెచ్‌లో చేరి వైద్యం పొందుతున్నారు. ఆయన వృద్ధాప్యం పింఛన్ తీసుకోవడానికి ఆరిలోవలో అందుబాటులో లేరు. దీంతో వలంటీరు శివదాళ్ల లీలాకృష్ణ శుక్రవారం కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న నర్సింగరావుకు పింఛన్ డబ్బులు అందజేశారు. దీంతో నర్సింగరావు ఆనందం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఉన్నప్పటికీ బెడ్ వద్దకు వచ్చి వలంటీరు పింఛన్ డబ్బులు ఇచ్చారని నర్సింగరావు సంతోషంతో తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో మాత్రం ఎంత అనారోగ్యం ఉన్నా పింఛన్ కోసం కార్యాలయానికి వెళ్లి ఎండలో గంటల తరబడి నిలబడాల్సి వచ్చేదని ఆయన గుర్తు చేసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నప్పుడు మాతో పాటు తోడుగా ఇంట్లో వారిని తీసుకెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను ఇంటికి పంపించడమే కాకుండా ఆస్పత్రిలో ఉన్నా బెడ్ దగ్గరకు పంపించి డబ్బులు అందించేటట్టు వలంటీర్లను నియమించడం బాగుందని, సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటామని ఆయన తెలిపారు.



కేజీహెచ్‌లో ఉన్న ఆరిలోవకు చెందిన వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు లీలాకృష్ణ



12వ వార్డులో లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీరు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పెన్షన్ పెంపుపై హర్షాతిరేకాలు

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఎన్నికల హామీ ప్రకారం సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డులో పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సూర్యుడు ఉదయించక ముందే అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చిందించాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్ల పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. గతంలో పింఛన్ తీసుకోవటానికి చాలా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు నేరుగా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారన్నారు. ఇటువంటి సీఎంను మళ్లీ మనం ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు క్షీరాభిషేకం

మద్దిలపాలెం : పెంచిన రూ.3 వేలు పెన్షన్‌ను జీవీఎంసీ 15వ వార్డులో శుక్రవారం పంపిణీ చేశారు. ముందుగా కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ముఖ్యఅతిథిగా పాల్గొని సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం లబ్ధిదారులకు రూ.3 వేలు పెన్షన్ అందజేశారు. అనంతరం లబ్ధిదారులనుద్దేశించి ముఖ్యమంత్రి పంపిన సందేశాన్ని ఆమె చదివి వినిపించారు.

జీవీఎంసీ 16వ వార్డుకు చెందిన ఓ వృద్ధురాలు అనారోగ్యంతో ఏఎస్ బీచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు పెంచిన రూ.3వేలు పెన్షన్‌ను శుక్రవారం వార్డు సచివాలయ కన్వీనర్ పార్వతి, వలంటీర్ శశికళ అందజేశారు. దీంతో వారికి ఆ వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.



15వ వార్డులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య



ఏఎస్ బీచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 16వ వార్డుకు చెందిన ఓ వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్, వార్డు కన్వీనర్ పార్వతి

రేపు అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మహాజనసభ

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌లోని స్వామి బృందావన కల్యాణ మండపంలో ఉదయం 9.45గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యుల షేర్‌ధనంపై చెల్లించే వడ్డీ , త్రిఫ్ట డిపాజిట్లకు వడ్డీ చెల్లించే విషయాలపై ఆమోదం తెలిపే అంశాలతో పాటు సంఘం అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సభలో చర్చించనున్నట్టు తెలిపారు. సంఘ సభ్యులందరూ హాజరు కావాలని స్వామి కోరారు.

చీపురు పట్టి చెత్త ఊడ్చారు..



క్రాంతినగర్‌లో రోడ్లపై చీపుర్లతో ఊడ్చుతూ శుభ్రం చేస్తున్న స్థానికులు

ఆరిలోవ: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు సుమారు పది రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో వీధులు చెత్తతో అస్తవ్యస్తంగా మారాయి. ఈ నేపథ్యంలో కాలనీల్లో స్థానికులు స్పందిస్తున్నారు. చీపుర్లు చేతపట్టి తమ కాలనీలను శుభ్రం చేసుకుంటున్నారు. శుక్రవారం 12వ వార్డు క్రాంతినగర్, దేవీ టవర్స్ ప్రాంతాలలో స్థానికులు చీపుర్లతో రోడ్లపై చెత్తను ఊడ్చారు. ఇళ్ల నుంచి తీసుకొచ్చి రోడ్డు పక్కన కొందరు వేసిన చెత్తను తొలగించి దూరంగా తీసుకెళ్లి పారబోశారు. వాటిన్నింటిని ఓ చోట కుప్పగా వేసి నిప్పంటించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎస్.సత్యనారాయణ, కె.ప్రసాదరావు, జి.నాగేశ్వరరావు, ఎస్.ఎస్.బ్రహ్మ, రమణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్విజ్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఫైనల్స్ నిర్వహించారు. ప్రథమ, తృతీయ బహుమతులను ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు, ద్వితీయ బహుమతిని ఎ.ఎస్.రాజా జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుపొందారు. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలను అందించారు. కార్యక్రమంలో పాత్రా కంపెనీ ఎండీ లక్ష్మి ముఖవల్లి, కళాశాల ప్రిన్సిపాళ్లు, డీన్లు, కో ఆర్డినేటర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలతో బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్ : స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేశారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) కేవీ పాపునాయుడుతో 4 జిల్లాల పథక సంచాలకులు, మెప్మా సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి అవగాహనతో కూడిన శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ–మార్ట్, పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ టిడ్కో గృహాల లబ్ధిదారులకు శత శాతం రుణాలు అందించేందుకు బ్యాంకులకు అనుసంధానం చేసి, అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అనకాపల్లి నుంచి సరోజిని, శ్రీకాకుళం నుంచి ఎం. కిరణ్‌కుమార్, విజయనగరం నుంచి బి. సుధాకరరావు, ఎస్ఎంసీలు ఆదినారాయణ, ఎస్. శ్రీనివాసరావు, రంగాచారి, లక్ష్మీనారాయణతో పాటు 4 జిల్లాల నుంచి డీఎంసీలు, సీవోలు పాల్గొన్నారు.

8 నుంచి శిల్పారామంలో సంక్రాంతి పోటీలు

మధురవాడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మధురవాడ శిల్పారామం జాతరలో జనవరి 8, 9,10 తేదీల్లో పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు శిల్పారామ అధికారి విశ్వనాథరెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా 8వ తేదీన సాయంత్రం 3గంటలు నుంచి 5గంటలు వరకు గాలిపటాలు పోటీలు, 9వ తేదీన సాయంత్రం 5గంటలు నుంచి 6గంటలు వరకు 10 ఏళ్ల లోపు పిల్లలకు సంప్రదాయ వస్త్రధారణ, 10వ తేదీ మధ్యాహ్నం 2గంటలు నుంచి 4గంటలు వరకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తారు. ముగ్గులు పోటీలకు కావలసిన సామగ్రి ఎవరికి వారే తెచ్చుకోవాలి. 13,14, 15,16 తేదీల్లో సాయంత్రం మధురవాడకు చెందిన ప్రైవేటు పాఠశాల విజయం సౌజన్యంతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన దలచిన వారు 96526 28100, 63090 29591లలో సంప్రదించాలని విశ్వనాథరెడ్డి కోరారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 23వ రోజు శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ, క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మూడు వందల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

బీసీల ద్రోహి చంద్రబాబు

మద్రిపాలెం: బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని, వారి సొమ్మును దోచుకున్న ద్రోహి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల బీసీ జోనల్ ఇన్‌చార్జి తుల్లి చంద్రశేఖర్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సొంత మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచినట్టు బీసీలకు కూడా ద్రోహం చేసిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. జయహో బీసీ సభలో బీసీల మీద కపట ప్రేమ చూపిస్తూ చేతకాని హామీలను ఇస్తూ మోసం చేయడానికి సిద్ధపడ్డారన్నారు. దోబీఘాట్లు కట్టడంలో, బీసీ పనిముట్ల కొనుగోలులో, భవనాలు కట్టిస్తానంటూ పలు స్కాంలకు పాల్పడి బీసీ నిధులని దోచుకుని.. దాచుకుని.. పంచుకున్న ఏకైక వ్యక్తి చంద్రబాబు అండ్ కంపెనీ కాదా అని ప్రశ్నించారు. బీసీల కోసం మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం కల్పించారని తుల్లి చంద్రశేఖర్ చెప్పారు.

జేసీఐ వైజాగ్ పెరామౌంట్ అధ్యక్షుడిగా చైతన్య రాజీవ్



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

బీచ్ రోడ్డు: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ వైజాగ్ పెరామౌంట్ నూతన అధ్యక్షుడిగా చైతన్య రాజీవ్ ఎంపికయ్యారు. శుక్రవారం సిరిపురంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా చైతన రాజీవ్, కార్యదర్శిగా జె.మౌనిక, ట్రెజరర్‌గా కె.గౌతమ్ ఎన్నికయ్యారు. ఈ ఏడాది నిర్వహించనున్న సేవా కార్యక్రమాలపై కార్యాచరణ వివరించారు.

అందరి సహకారంతో ధరిత్రి పరిరక్షణ



సైకిల్ యాత్రికుడు పరాగ్ మైతితో మిద్దెతోట పెంపకందార్లు

మురళీనగర్: ధరిత్రి పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పరాగ్ మైతి అన్నారు. ధరిత్రి పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర చేస్తున్న కోల్‌కతా యువకుడు పరాగ్ మైతి శుక్రవారం మురళీనగర్‌లో మిద్దె తోటల పెంపకందారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత విశాఖ సాధించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మిద్దె పంటలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. తాను ఇంత వరకు నాలుగు రాష్ట్రాల్లో నాలుగు వేల కిలోమీటర్లు సైక్లింగ్ చేశానని.. ఇంకా వెయ్యి కిలోమీటర్ల యాత్ర నిర్వహించిన అనంతరం కోల్‌కతా చేరుకుంటానన్నారు. గ్రీన్ క్లైమేట్ బృందం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

వెస్ట్ క్రైం సీఐ బాధ్యతల స్వీకరణ



మద్రిపాలెం: వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐగా ఎస్.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన సంతకం పెట్టి విధుల్లో చేరారు. గతంలో త్రీటౌన్ క్రైం ఎస్ఐగా, విజయనగరం, పార్వతీపురం స్పెషల్ బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేరాల నియంత్రణలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు.

గోస్తనిలో జారి పడి యువకుడి మృతి



రాము మృతదేహం

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస వద్ద శుక్రవారం గోస్తనిలో కాలు జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. సామయ్యవలస చెందిన సేనాపతి రాము(34) మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గోస్తని నదిలో స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి నదిలో పడి మరణించాడు. రాము భార్య వెంకట లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హాస్య నాటిక ప్రదర్శన రేపు

మురళీనగర్: కళల ప్రోత్సాహంలో భాగంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఈ నెల 7న హాస్య నాటిక ప్రదర్శించనున్నట్టు పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 7 గంటలకు ఏక్ దిన్‌కా సుల్తాన్ నాటికను మాధవధార శ్రీచైతన్య కళాసాగర్ నటులు ప్రదర్శిస్తారన్నారు. జంధ్యాల రచించిన ఈ హాస్య నాటికకు సనపల సన్యాసయ్య దర్శకత్వ, ఎల్వీ రమణ పర్యవేక్షణ వహిస్తారని చెప్పారు. సన్యాసయ్య, ఎస్.రామానుజయ్య, పి.గిరిధర్, నటిస్తారని, సత్యనారాయణమూర్తి సంగీతం అందిస్తారన్నారు.

జగదీష్‌కు గిరిజన కథ సాహిత్య పురస్కారం



సాహిత్య పురస్కార సభలో పాల్గొన్న ప్రముఖులు

మద్దిలపాలెం : ఆదివాసీల జీవితాలను సాహిత్యంలో తన కథా వస్తువులుగా రయిత మల్లిపురం జగదీష్ ఎంచుకున్నారని ప్రముఖ సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు తెలిపారు. కళాభారతిలో జరుగుతున్న అజో–విభో–కందాళం, రైటర్స్ అకాడమీ నిర్వహించిన పురస్కార సభలో సరిలేరు నీకెవ్వరు విశిష్ట గిరిజన కథ సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత మల్లిపురం జగదీష్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అప్పలనాయుడు మాట్లాడుతూ జగదీష్ రచనల్లో ఆదివాసీల జీవన పరిస్థితులు కనిపిస్తాయన్నారు. దాదాపు 40 ఏళ్ల ఆదివాసీలోని మార్పులు తెలుసుకోవాలంటే జగదీష్ రచనలు చదవాలన్నారు. ఆయన రచనల సంపుటి పుస్తకాన్ని విడుదల చేశామన్నారు.



ఒక రాక్షసుడి కథ నాటికలో సన్నివేశం

ఆకట్టుకున్న రెండో రోజు నాటిక పోటీలు

అజో–విభో–కందాళం, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న నాటిక పోటీలలో రెండో రోజు శుక్రవారం ఒక రాక్షసుడి కథ నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. విజయనగరానికి చెందిన కేకేఎల్ స్వామి, నాటకీకరణ చేసి, దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, వి.ఎస్.ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం కార్మికుల ఆందోళన

- వేతన బకాయిల చెల్లింపునకు డిమాండ్

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు 44 రోజుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గంగవరం పోర్టు లోపల రైల్వే ట్రాక్ గేటుతో పాటు ఔట్ గేటు వద్ద వీరంతా బైఠాయించారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కడంతో యాజమాన్య ప్రతినిధులు న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, బందోబస్తు నిర్వహించారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గరికిన నూకరాజు అనే కార్మికుడు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారని, అయితే అతనికి కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు యాజమాన్యం నిరాకరించిందన్నారు. కార్మికులంటే యాజమాన్యానికి చిన్నచూపు తగదన్నారు. వెంటనే యాజమాన్యం తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



గంగవరం పోర్టు లోపల బైఠాయించిన కార్మికులు

అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండరులో పాల్గొనాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో పొరుగు సేవల ద్వారా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గత నెల 26 నుంచి విధులకు గైర్హాజరవుతున్నందున గృహ, గృహేతరాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థపదార్థాలు ఎప్పటికప్పుడు తరలించేందుకు అద్దె ప్రాతిపదికన టాటా వెహికల్స్ సమకూర్చేందుకు స్వల్ప వ్యవధితో కూడిన ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ జారీ చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండర్ నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని కమిషనర్ పేర్కొన్నారు.